# సాక్షి
## కామారెడ్డి

శుక్రవారం 1 మార్చి 2024






### హస్తానిదే విజయం

ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు.

- 9లో ▸



### ఖండేరాయుడి కల్యాణం

సదాశివనగర్ మండలం ఉత్నూర్‌లో ఖండేరాయుడి కల్యాణ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు.

- 9లో ▸

### వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.9 /17.3

ఉదయం చలిగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత కొనసాగుతుంది.

## న్యూస్‌రీల్

### ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం



కామారెడ్డి టౌన్ : ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొత్తం 37 పరీక్ష కేంద్రాల్లో 8,412 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 8,202 మంది హాజరయ్యారు. 210 మంది గైర్హాజరయ్యారు. పలు పరీక్షా కేంద్రాలను కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి షేక్ సలాం పరిశీలించారు.

### సివిల్ సర్వీసెస్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు ఎంపిక



శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి అర్బన్ : ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు కామారెడ్డికి చెందిన వ్యవసాయ విస్తరణ అధికారి కె శ్రీనివాస్‌రెడ్డి ఎంపికయ్యారు. మార్చి 3 నుంచి 9 వరకు చండీఘడ్‌లో జరిగే టోర్నీలో ఆయన పాల్గొననున్నారు. శ్రీనివాస్‌రెడ్డిని నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, కార్యదర్శి సాయిలు, పలువురు ఉద్యోగులు అభినందించారు.

### చెట్ల లెక్కింపు పకడ్బందీగా చేపట్టాలి



నాగిరెడ్డిపేట : రోడ్డు వెడల్పులో భాగంగా తొలగించాల్సిన చెట్ల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని కామారెడ్డి ఎఫ్‌డీవో గోపాల్‌రావు సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని బంజరతండా వద్ద ఫారెస్ట్ అధికారులు చేపట్టిన చెట్ల లెక్కింపు ప్రక్రియను ఆయన గురువారం పరిశీలించారు. ఫారెస్ట్ అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. మెదక్ నుంచి నిజామాబాద్ జిల్లా రుద్రూర్ వరకు చేపట్టనున్న రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా మండల పరిధిలో గల అటవీప్రాంతంలో 291చెట్లు తొలగించనున్నట్లు చెప్పారు. ఎఫ్ఆర్‌వోలు చరణ్‌తేజ్, వాసుదేవ్, డీఎఫ్ఆర్‌వో రవికుమార్, బీట్ ఆఫీసర్ నవీన్ ఉన్నారు.

### కోర్టును ఆశ్రయించిన కాంట్రాక్టర్

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి జిల్లా జనరల్ ఆస్పత్రిలో రోగులను ఎలుకలు కరిచిన ఘటనలో సానిటేషన్ కాంట్రాక్టర్‌పై అధికారులు వేటు వేసి కాంట్రాక్ట్ రద్దు చేశారు. బాన్సువాడ ఆస్పత్రి కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించారు. దీంతో ఆ కాంట్రాక్టర్ తనకు అన్యాయం జరిగిందని హైకోర్టును ఆశ్రయించారు. ఆ కాంట్రాక్టర్ పనితీరుపై 80 శాతం మార్కులు వేసి చాలా బాగుందని ఇటీవలే ఆస్పత్రి సూపరింటెండెంట్ ధ్రువీకరించారు. ఆ ఉత్తర్వులను ఆధారంగా చేసుకుని కాంట్రాక్టర్ హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం కోర్టుకు హాజరు కావాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్తకు నోటీసులు అందాయి.

### నర్సింగ్ కళాశాల సందర్శన



బాన్సువాడ రూరల్ : మండలంలోని నర్సింగ్ కళాశాలతో పాటు అనుబంధంగా ఉన్న హాస్టల్‌ను గురువారం మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. అందుతున్న భోజనం, వసతి ఏర్పాట్లపై ఆరా తీశారు. మనసుపెట్టి చదువుకోవాలని నర్సింగ్ పూర్తిచేసిన విద్యార్థులకు చక్కటి భవిష్యత్తు ఉంటుందని ఆయన అన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న నర్సింగ్ కళాశాల నూతన భవనాన్ని పరిశీలించారు. ఆయన వెంట నాయకులు మోహన్, మొగులయ్యతో పాటు భగవాన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



నిజామాబాద్ విజయ సంకల్ప యాత్ర ముగింపు సభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, చిత్రంలో ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు

# పసుపునకు డిమాండ్

**బోర్డు ఏర్పాటుకు కట్టుబడి ఉన్నాం**

- కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు హైవేల నిర్మాణం
- కాంగ్రెస్ పాలనలో రైతుల ఆత్మహత్యలు
- 50 ఏళ్లలో ఆ పార్టీ దేశానికి చేసిందేమీలేదు
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

సుభాష్‌నగర్/నిజామాబాద్‌రూరల్: విదేశాల్లో సేంద్రియ పసుపునకు డిమాండ్ ఉందని.. జిల్లాలో పండించే పసుపు స్వచ్ఛమైందని.. ఇతర దేశాలకు ఎగుమతి చేయవచ్చని కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ ప్రకటన మేరకు పసుపుబోర్డు ఏర్పాటుకు కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు. కొమురం భీం క్లస్టర్ విజయ సంకల్ప యాత్ర ముగింపు సభను గురువారం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నితిన్ గడ్కరీ ప్రసంగిస్తూ.. కాంగ్రెస్ పార్టీ 50 ఏళ్లలో దేశానికి చేసిందేమీ లేదని, ముఖ్యంగా రైతాంగానికి తీవ్ర అన్యాయం చేసిందని గడ్కరీ విమర్శించారు. ఆ పార్టీ పాలనలో దేశంలోని షుగర్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయని.. కానీ బీజేపీ హయాంలో ఇప్పటి వరకు 66 ఫ్యాక్టరీలను తిరిగి తెరిపించామని, మిగతా వాటిని కూడా తెరిపించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో సుమారు 30వేల గ్రామాల్లో ప్రజలకు ఉపాధి, సరైన సౌకర్యాలు, సాగునీరు, విద్యుత్ లేక పట్టణాలకు వలసలు వెళ్లారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో ఉన్న షుగర్ ఫ్యాక్టరీలను ప్రైవేటీకరించి భ్రష్టు పట్టించారని ఆరోపించారు. కాలుష్య నివారణ కోసం కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్, హైడ్రోజన్ వాహనాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తోందని తెలిపారు. తెలంగాణలో 7వేల కిలోమీటర్ల జాతీయ రహదారులు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు.

**రహదారుల అనుసంధానం**

బీజేపీ పాలనలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు జాతీయ రహదారులను నిర్మించామని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం రోడ్ల అనుసంధానంతో గ్రామాల్లోనే నిరుపేదలకు ఉపాధి కల్పిస్తున్నామని పేర్కొన్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలి, లద్దాఖ్, కార్గిల్, శ్రీనగర్, జమ్మూ కశ్మీర్, అమృతసర్, ఢిల్లీ నుంచి ముంబయి, నాసిక్, అహ్మదాబాద్, సోలాపూర్, బెంగళూరు జాతీయ రహదారులపై టన్నెల్స్‌ను నిర్మించామన్నారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని అన్ని జాతీయ రహదారులను అమెరికాలోని రహదారులుగా మారుస్తామని ప్రజలకు హామీనిచ్చారు.

సభకు హాజరైన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, వివిధ మోర్చాల ప్రతినిధులు సన్మానించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, ప్రదీప్‌కుమార్, వెంకటరమణి, గద్దె భూమన్న, పెద్దోళ్ల గంగారెడ్డి, మారంపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### షుగర్ ఫ్యాక్టరీలపై కాంగ్రెస్ కాలయాపన : ఎంపీ అర్వింద్

రాష్ట్రంలో షుగర్ ఫ్యాక్టరీల పున:ప్రారంభంపై కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీలతో కాలయాపన చేస్తోందని ఎంపీ అర్వింద్ ఆరోపించారు. కానీ బీజేపీ అధికారంలోకి వస్తే షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని పేర్కొన్నారు. పసుపు రైతుల 38 ఏళ్ల కల అయిన పసుపు బోర్డును ప్రధాని మోదీ ప్రకటించారన్నారు. కేబినెట్ ఆమోదం, గెజిట్ నోటిఫికేషన్ కూడా వచ్చిందని తెలిపారు. బోర్డు కార్యకలాపాలు అతి త్వరలోనే ప్రారంభమవుతాయని ప్రకటించారు. పసుపు ధర రూ. 14 వేలు దాటిందని, ఎగుమతులు పెంచితే ధర 20వేలు దాటుతుందని ధీమా వ్యక్తంచేశారు.

### రైతుల ఆదాయం పెంచేందుకు కృషి

బీజేపీ పదేళ్ల పాలనలో రైతుల ఆదాయాన్ని పెంచేందుకు అనేక పథకాలు అమలు చేస్తున్నామని కేంద్ర మంత్రి వివరించారు. రైతులు పండించిన పంటల కు మద్దతు ధర కల్పించినప్పుడే ధనవంతులుగా మారుతారన్నారు. దేశంలోని రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఇథనాల్ ఉత్పతికి ప్రోత్సాహకా న్ని మోదీ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. చెరుకు రసంతో మొలాసిస్ తయారవుతుందని, మొలాసిస్‌తో ఇథనాల్ ఉత్పత్తి అవుతుందన్నారు. ఇథనాల్ నుంచి విమాన ఇంధనం కూడా తయారవుతుందని తెలిపారు. ఇథనాల్ ఉత్పత్తిలో రైతులు భాగస్వాములు అవుతున్నారని, నెలకు రూ. 5లక్ష ల వరకు లాభాలను ఆర్జిస్తున్నారని పేర్కొన్నారు.



సభకు హాజరైన మహిళలు

# మూడోసారీ మోదీ ప్రభుత్వమే..



బాన్సువాడలో మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

- జహీరాబాద్‌పై బీజేపీ జెండా ఎగురవేయాలి
- కాళేశ్వరం.. కుంగేశ్వరం అంటూ కాంగ్రెస్ కహానీలు
- విజయ సంకల్ప యాత్రలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

నిజాంసాగర్/బిచ్కుంద/బాన్సువాడ : కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని కామారెడ్డి ఎమ్మెల్యే, బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లాలోని జుక్కల్, బిచ్కుంద, బాన్సువాడలో గురువారం ఆయన విజయ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పాత ముఖ్యమంత్రి పేరు చెప్పడం తప్పా ఏ పని చేయడం లేదన్నారు. కాళేశ్వరం.. కుంగేశ్వరం అంటూ కహానీలు చెప్పడం తప్పా ప్రజలకు చేసిందేమి లేదన్నారు. కాళేశ్వరంలో నీళ్లు నింపుతే ఉంటుందా.. కూలిపోతుందా అని ఆలోచించడం లేదన్నారు. అధికారంలోకి రాకముందు అందరికీ ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు కొర్రీలు పెడుతుందని విమర్శించారు. రేషన్ కార్డు ఉంటేనే పథకాలు అందుతాయనడం సరికాదన్నారు. ఏళ్ల నుంచి కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో ఎంతోమంది పథకాలకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయాలంటే రూ.రెండు లక్షల కోట్లు అప్పు చేయాలన్నారు.

**జుక్కల్‌లో అభివృద్ధి శూన్యం**

జుక్కల్ నియోజకవర్గాన్ని గతంలో పనిచేసిన ఎమ్మెల్యేలు పట్టించుకోలేదన్నారు. వాళ్ల స్వప్రయోజనాల కోసం పనిచేశారని ఆరోపించారు. ఒకరేమో మండలానికి ఒక్క ఇల్లు కట్టిండు, మరొకాయననేమో బయట సంపాదించి బయటనే పెట్టిండని ఆరోపించారు. రాష్ట్రంలోని 80 నియోజకవర్గాల్లో తాను పర్యటించానని, కానీ జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని నారాయణఖేడ్, అందోల్, జుక్కల్ నియోజకవర్గాల అంత అధ్వానంగా ఎక్కడ లేదన్నారు.

**17 ఎంపీ స్థానాలు గెలుస్తాం..**

బీజేపీ చేపట్టిన విజయసంకల్ప యాత్ర 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొనసాగుతుందని, రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని వెంకటరమణారెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డిలో తాజా, మాజీ ముఖ్యమంత్రులను ఓడించానని చెప్పారు. ఇద్దరు ఉద్దండులను మట్టి కరిపించిన బీజేపీ కార్యకర్తలు పార్లమెంట్ ఎన్నికల్లో ఇలాగే కష్టపడాలని కోరారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ప్రభుత్వం ఆర్టీసీ ఆస్తులను లీజుకు ఇచ్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీనారాయణ, నాయకులు జైపాల్‌రెడ్డి, పైడి ఎల్లారెడ్డి, ఆలే భాస్కర్, శ్రీనివాస్ కార్గే, దొరబాబు, చీదరి సాయిలు, పైడిమల్ లక్ష్మీనారాయణ, కిష్టారెడ్డి, విష్ణు, బద్దం మహిపాల్‌రెడ్డి, సాయిరెడ్డి, గుడుగుట్ల శ్రీనివాస్, శంకర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, చీదరి రాజు, గంగారం తదితరులు ఉన్నారు.



బాన్సువాడలో సభకు హాజరైన జనం

# మెగా డీఎస్సీతో అభ్యర్థుల్లో ఆనందం

**జిల్లాలో 506 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు**

కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం గురువారం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయడంతో విద్యాశాఖలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు త్వరలో భర్తీ కానున్నాయి. దీంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో విద్యాశాఖలో 506 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలుగా ఉన్నాయి.

వీరిలో స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) 121, లాంగ్వేజ్ పండిత్ 15, ఫిజికల్ టీచర్ 5, సెకండరి గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) 318, స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యూకేటర్స్) 11, సెకండరీ గ్రేడ్ టీచర్(స్పెషల్ ఎడ్యూకేటర్స్) 36 ఖాళీలు ఉన్నాయి. నోటిఫికేషన్ వెలువడటంతో అభ్యర్థులు పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు సిద్ధమవుతున్నారు.

# రైతులు చేపల పెంపకంపై దృష్టి సారించాలి

రామారెడ్డి : రైతులు వ్యవసాయంతో పాటు చేపల పెంపకం చేపట్టి లాభాలు పొందాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. రామారె డ్డి మండలం పోసానిపేటలో మహిళా రైతు లక్ష్మి తన పొలంలో ఫిష్‌పాండ్ ఏర్పాటు చేసి చేపల పెంపకం చేపట్టారు. ఫిష్‌పాండ్‌ను క లెక్టర్ గురువారం పరిశీలించారు. వ్యవసాయంతో పాడి పశువులు, చేపల పెంపకం చే పట్టాలని ఆయన సూచించారు. డీఆర్‌డీవో చందర్, ఎంపీడీవో సవిత రెడ్డి, డీపీఎం రమేశ్‌బాబు, ఏపీఎం ప్రసన్నకుమార్, సమన్వయకర్తలు దుర్గాదాస్, ప్రతాప్, భూమేష్ పాల్గొన్నారు.



ఫిష్‌పాండ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్



ఎల్లారెడ్డిలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

### పరీక్ష కేంద్రం తనిఖీ

ఎల్లారెడ్డి : ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.

# పచ్చని చెట్లకు నిప్పు

- రోడ్డు పక్కన వృక్షాలు తగలబెడుతున్న దుండగులు
- నేల కూలుతున్న చెట్లు
- కలప కోసం వ్యాపారులే చేయిస్తున్నట్లు అనుమానం

ఎల్లారెడ్డి రూరల్ : పచ్చదనాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటిస్తుంటే.. కొందరు మాత్రం మహా వృక్షాలను నేల కూలుస్తున్నారు.. కలప కోసం రోడ్డు పక్కన ఉన్న చెట్లకు నిప్పు పెట్టి పడిపోయేలా చేస్తున్నారు. అనంతరం కూలిన చెట్లను తక్కువ ధరకు వేలంలో దక్కించుకొని కలప వ్యాపారం చేస్తున్నారు. ఎల్లారెడ్డి పరిధిలోని ఒడ్డెర కాలనీ శివారులో పెద్దపెద్ద మర్రి వృక్షాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెడుతున్నారు. పశువుల పేడలో పాదరసం కలిపి చెట్టు మొదలులో ఉంచుతున్నారు. దానిచుట్టు వరి పొట్టును పోసి రాత్రి సమయంలో మంట పెడుతున్నారు. చెట్ల చుట్టు ఉన్న పొట్టుతో మొదలులో మంటలు వ్యాపించి చెట్టు మోడుగా మారుతోంది. దీంతో చిన్నపాటి గాలి వచ్చిన అది నేల కూలుతుంది. తమ వ్యాపారం కోసం కలప వ్యాపారులే ఈ పని చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.



ఎల్లారెడ్డి శివారులో చెట్టుకు నిప్పు పెడుతున్న వ్యక్తి (ఫైల్)

**సిండికేట్‌గా మారుతున్న కలప వ్యాపారులు**

నేల కూలిన చెట్లను అక్కడి నుంచి తరలించేందుకు ఆర్అండ్‌బీ అధికారులు వేలం వేస్తున్నారు. వాటిని దక్కించుకునేందుకు కలప వ్యాపారులు సిండికేట్‌గా మారుతున్నారు. తక్కువ ధరకు కలప వేలం పాడుతున్నారు. అనంతరం ఆ కలపకు వ్యాపారులు వారిలో వారు వేలం వేస్తారు. అందులో అధికంగా పాడిన వారు కలప తీసుకుంటున్నారు. అందులో ప్రభుత్వం వేలంలో పాడిన డబ్బు పోనూ మిగిలిన దానిని వ్యాపారులు అందరు సమానంగా పంచుకుంటున్నారు. వేలం పాడిన కలపను రవాణా చేసేందుకు ఆర్అండ్‌బీ అధికారులు అటవీశాఖ నుంచి అనుమతులు తీసుకుంటున్నారు. దీంతో వ్యాపారులు ఇష్టమున్న చోటకు కలప రవాణా చేసి లాభాలను అర్జిస్తున్నారు. నిప్పు పెట్టే వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు కలప రవాణాకు సంబంధించి పర్మిట్లు నిలిపి వేస్తే చెట్లను కాపాడొచ్చని పర్యావరణ ప్రేమికులు అంటున్నారు.



కాలిపోయిన చెట్టు మొదలు

**భయపడుతూ ప్రయాణం**

ప్రధాన రహదారుల వెంట చెట్లకు నిప్పు పెట్టడంతో అవి మోడుబారి ఎప్పుడు కూలిపోతాయో తెలియకుండా ఉంటున్నాయి. ఆ చెట్ల కింద నుంచి వెళ్లాలంటే వాహనదారులు భయపడుతున్నారు. ఎక్కడ తమపై పడుతాయోనని ఆందోళన చెందుతున్నారు. మోడు వారిన చెట్లను తొలగించడంతో పాటు నిప్పు పెట్టే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**భయమేస్తోంది..**



నిప్పు పెట్టడంతో మోడు వారిన చెట్ల కింద నుంచి వెళ్లాలంటే భయమేస్తోంది. ఎప్పుడు మీద పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రమాదం జరగకముందే అధికారులు చర్యలు చేపట్టాలి

– జిలాని, ఎల్లారెడ్డి

**చర్యలు తీసుకోవాలి**



ప్రధాన రహదారుల వెంట చెట్లకు నిప్పు పెడుతున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. చెట్లు కూలేలా కొందరు కలప వ్యాపారులు ప్రయత్నిస్తున్నారు. చెట్లు పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

– నారాయణ, హాజీపూర్


**మా దృష్టికి వచ్చింది**

ఎల్లారెడ్డి శివారులో చెట్లకు నిప్పు పెట్టిన విషయం నా దృష్టికి వచ్చింది. చెట్లకు మంట పెడుతున్న వ్యక్తికి సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేశాం. చెట్లు కూల్చేందుకు యత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరైనా చెట్లకు నిప్పు పెడితే గమనించిన ప్రజలు మాకు సమాచారం ఇవ్వాలి.

– శ్రీకాంత్, ఏఈ, ఆర్అండ్‌బీ, ఎల్లారెడ్డి

# ధరణి బాధితులకు ఊరట

- పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశాలు
- నేటి నుంచి 9 వరకు సదస్సులు
- కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ల ఆధ్వర్యంలో కమిటీలు



కామారెడ్డి క్రైం : ధరణి బాధితులకు ఊరటనిచ్చే ముచ్చట చెప్పింది కొత్త ప్రభుత్వం. ధరణి కారణంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా ఉత్తర్వులు జారీ చేసింది. నేటి(శుక్రవారం) నుంచి 9వ తేదీ వరకు మండల స్థాయిలో ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేసి వెంటనే పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ల ఆధ్వర్యంలో కమిటీలు వేసింది. ఆయా కమిటీలకు నిర్ణీత గడువును నిర్దేశించి దరఖాస్తుల పరిష్కారం పూర్తి చేయడంతో పాటు ఆన్‌లైన్‌లో రికార్డు చేయాలని సీఎస్ శాంతికుమారి నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని అనేక భూ సమస్యలు ఈ సదస్సుల ద్వారా పరిష్కారం కావొచ్చని రెవెన్యూ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**కమిటీ సూచన మేరకు..**

బీఆర్ఎస్ ప్రభుత్వం 2016లో ధరణి వెబ్‌సైట్‌ను తీసుకు వచ్చింది. ధరణి రాగానే మొత్తం భూముల వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేసేందుకు 2018లో రికార్డుల ప్రక్షాళన పేరిట హడావుడి చేశారు. వేగంగా ప్రక్రియ పూర్తి చేయాలని అప్పట్లో రెవెన్యూ అధికారులపై ప్రభుత్వం ఒత్తిడి పెంచడంతో అనేక తప్పిదాలు దొర్లాయి. రైతుల పేర్లు, ఫొటోలు, సర్వే నంబర్లు, విస్తీర్ణంలో తప్పుగా నమోదు కావడం, చాలా మంది రైతుల పట్టా భూములు ప్రభుత్వ, అటవీ భూములుగా నమోదు కావడం, నిషేధిత జాబితాలో పడటం లాంటి సమస్యలు తలెత్తాయి. కామారెడ్డి జిల్లాలోనే ఇలాంటి సమస్యలు ఐదువేలకు పైగా ఉంటాయి. అప్పటి నుంచి రైతులు తమ భూ సమస్యల పరిష్కారానికి కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఎన్నికలకు ముందే ధరణి సమస్యలను పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారంలోకి రాగానే ధరణి సమస్యలను అధ్యయనం చేయడానికి ప్రత్యేక కమిటీని వేశారు. నెల రోజులుగా ఈ కమిటీ రెవెన్యూ అధికారులు, కలెక్టర్‌లతో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసింది. క్షేత్రస్థాయిలోనూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించింది. ధరణిలోని లోపాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిన కమిటీ ఈ నెల 24న సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమైంది. పెండిగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సీఎం అదే రోజున రెవెన్యూ శాఖకు సూచించారు. కమిటీ సూచన మేరకు ఇప్పటివరకు కలెక్టర్‌లకు మాత్రమే ఉన్న అధికారాలను వికేంద్రీకరిస్తూ అదనపు కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌లతో కమిటీలు వేసి గ్రామాల్లోని ధరణి బాధితుల అన్ని సమస్యలను గడువులోగా పరిష్కరించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఏ స్థాయి అధికారికి ఎలాంటి అధికారాలు ఉంటాయో మార్గదర్శకాల్లో సూచించారు.

# పరీక్షల్లో వసూళ్లు!

- టీసీసీ పరీక్ష నిర్వహణలో ఒక్కో అభ్యర్థి నుంచి రోజుకు రూ. 500
- పంపకాల్లో తేడా రావడంతో బట్టబయలు



**నిజామాబాద్‌అర్బన్‌:** టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ (టీసీసీ) పరీక్షల నిర్వహణలో భారీగా వసూళ్లు జరిగాయి. పరీక్ష నిర్వాహకులు అభ్యర్థుల నుంచి డబ్బు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. టైలరింగ్, డ్రాయింగ్ పరీక్షలు ఈనెల 23 నుంచి 26 వరకు జరిగాయి. అభ్యర్థులతో కలిసి నిర్వాహకులు అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. పరీక్షల్లో జిల్లా విద్యాశాఖ అధికారుల పేర్లు చెప్పి వసూలు చేపట్టడం గమనార్హం.

**పాస్ కావాలంటే పైసలు ఇవ్వాల్సిందే..**

ఇటీవల నిర్వహించిన టైలరింగ్, లోయర్, హయ్యర్ డ్రాయింగ్ పరీక్షలకు 420 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. వీరికి నగరంలోని కోటగల్లీలో ఉన్న పాఠశాల, ఆదర్శ హిందీ విద్యాలయం, ఖిల్లా ప్రభుత్వ పాఠశాలలో పరీక్షలు నిర్వహించారు. ఒక్కోసెంటర్‌కు ఐదు నుంచి పది చొప్పున ఇన్విజిలేటర్ల కూడా కేటాయించారు. కానీ ఇక్కడే మతలబు ఏర్పడింది. కోటగల్లిలోని పాఠశాల నిర్వాహకులే అభ్యర్థులతో కుమ్మక్కై కొందరు అభ్యర్థుల నుంచి రోజుకు రూ. 500 చొప్పున తీసుకొని ఒకరికి బదులు మరొకరి పరీక్షలు రాయించినట్లు తెలిసింది. ఈ పరీక్ష కేంద్రంలో 64 మంది వివిధ విభాగాల్లో పరీక్షలు రాశారు. ఓ మహిళను అడ్డుపెట్టుకొని అభ్యర్థులను ప్రత్యేకంగా సంప్రదించి ఈ వసూళ్లు చేపట్టారు. ఈ పరీక్షలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం, అధికారులు దృష్టి పెట్టకపోవడంతో నిర్వహణలో బాధ్యతలు తీసుకున్న వారు అక్రమాలకు పాల్పడ్డారు. మరో పరీక్ష సెంటర్‌లో ప్రతిరోజు డబ్బులు ఇవ్వాల్సిందేనంటూ అభ్యర్థులతో కలిసి అక్రమాలకు పాల్పడినట్లు సమాచారం. టైలరింగ్‌లో అభ్యర్థిగా వేరేవారు పాల్గొని థియరీ పరీక్షలు రాసినట్లు తెలిసింది. పరీక్ష జరిగిన మొదటి రోజు నుంచే అభ్యర్థులతో నేరుగా గదిలోకి వెళ్లి అధికారులు రోజుకు ప్రతిఒక్కరూ డబ్బులు ఇస్తే కచ్చితంగా పాసు చేస్తామని ఒకరికి బదులు మరొకరు కూడా రాసుకునే వెసులుబాటు ఉంటుందని పేర్కొన్నారు. రూ. 500 ఇచ్చిన వారికి రాసుకునే వెసులుబాటు, రూ. 1000 ఇచ్చిన వారికి ఒకరికి బదులు ఒకరు రాసుకునే వెసులుబాటు కల్పించినట్లు వారి వసూలు బట్టి తెలుస్తోంది. ఇలా వసూలు చేసిన డబ్బులను పరీక్ష నిర్వహణలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికి డబ్బులు ఇవ్వాలని ముందుగా నిర్ణయించుకున్నారు. కానీ ఇందులో కొందరు ఇన్విజిలేటర్లకు డబ్బులు అందకపోవడంతో రెండు రోజుల క్రితం సదరు అధికారిపై డబ్బులు ఇస్తారా లేదంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానంటూ వాగ్వాదం జరిగింది. ఇదే తరుణంలో వీరి అక్రమాలు బయటకు వచ్చాయి.

**అక్రమార్కులకే అదనపు బాధ్యతలు**

అక్రమాలకు పాల్పడే వారికి అదనపు బాధ్యతలు కూడా కేటాయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పరీక్ష నిర్వహణ బాధ్యతతో పాటు పాఠశాల బాధ్యతలు కూడా అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీరు తమకు అనుకూలమైన సిబ్బందిని నియమించుకొని పరీక్షల్లో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. మూడు పరీక్ష కేంద్రాల్లోనూ సుమారు 60 శాతం మంది అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ఉన్నత అధికారుల పర్యవేక్షణ, మండల స్థాయి అధికారులు పదో తరగతి పరీక్షల్లో బిజీగా ఉండడంతో ఇటువైపు కన్నెత్తి చూడలేదు. దీనినే ఆసరాగా మార్చుకొని సాధారణ నిర్వాహకులు ఇష్టానుసారంగా పరీక్షలు నిర్వహించినట్లు ఆరోపణలున్నాయి.

## ముగిసిన విజయ సంకల్ప యాత్ర





కేంద్ర మంత్రిని సన్మానిస్తున్న ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, రాకేశ్‌రెడ్డి

జిల్లాలో నిర్వహించిన విజయ సంకల్ప యాత్ర గురువారం ముగిసింది. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో నిర్వహించిన ముగింపు సభకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడిరాకేశ్‌రెడ్డి స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. సభలో కేంద్ర మంత్రితో ఎంపీ అర్వింద్ కొద్దిసేపు ముచ్చటించారు. సభలో కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



–సాక్షి, నెట్‌వర్క్



సభలో పాల్గొన్న కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు

## క్లుప్తంగా

### జిల్లాలో 30, 30 ఏ పోలీస్ యాక్టు అమలు

**కామారెడ్డి క్రైం:** జిల్లా వ్యాప్తంగా ఈ నెల 1 నుంచి 7 వరకు 30, 30ఏ పోలీస్ యాక్టు అమల్లో ఉంటుందని ఎస్పీ సింధు శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు, ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు చేపట్టకూడదన్నారు. ఏవైనా కార్యక్రమాలు చేయాలనుకునే వారు సంబంధిత సబ్ డివిజన్ పోలీసులను సంప్రదించి అనుమతి పొందాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

### అన్నపూర్ణ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన



**బిచ్కుంద(జుక్కల్) :** మండల కేంద్రంలోని బండయప్ప మఠంలో గురువారం అన్నపూర్ణదేవి, గణపతి విగ్రహం, నవగ్రహాల విగ్రహాలను ప్రతిష్ఠించారు. మఠం పీఠాధిపతి శ్రీ సోమయప్ప స్వామి, కౌలాస్, ఖద్గాం, హనేగాం మఠం పీఠాధిపతుల సమక్షంలో ప్రత్యేక పూజలు, హోమాలు, యజ్ఞయం, పాలాభిషేకం చేసి విగ్రహాల ప్రతిష్ఠాపన చేశారు. అన్నపూర్ణ దేవి మందిరం ముందు ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పాల్గొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పీఠాధిపతి శ్రీ సోమయప్ప స్వామి మాట్లాడుతూ ప్రజలు చెడు వ్యాసనాలకు దూరంగా ఉండి దైవభక్తి పెంపొందించుకోవాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మఠాధిపతులు మల్లికార్జున్ స్వామి, శంకరాలింగ వివాచార్య, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### ‘డిజిటల్ మాధ్యమాలతో బోధన సులభం’



**కామారెడ్డి అర్బన్ :** డిజిటల్ మాధ్యమాలతో పాఠ్యాంశాల బోధన మరింత సులభం కావడంతో పాటు విద్యార్థులకు బాగా బోధపడుతుందని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కే.విజయ్‌కుమార్ అన్నారు. గురువారం కళాశాల రూసా బ్లాక్‌లో 15 తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన డిజిటల్ ప్రొజెక్టర్లను ప్రిన్సిపాల్ ప్రారంభించి అనంతం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కళాశాల స్వయంప్రతిపత్తి హోదా పొందిన తర్వాత సాంకేతికాభివృద్ధికి అనుగుణంగా బోధనలో సుద్దముక్క, డస్టర్, నల్లబోర్డు అవసరం లేకుండా డిజిటల్ బోధనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. విద్యార్థులకు బోధన మరింత ఆకర్షణీయంగా మారి మంచి ఫలితాలు సాధిస్తామని ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కే.కిష్టయ్య, ఐక్యూఏసీ సమన్వయకర్త ఎం.చంద్రకాంత్, అధ్యాపకులు ఎన్.రాములు,రాజ్‌గంభీర్‌రావు, చంద్రశేఖర్‌గౌడ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో చేరిన మరో ఇద్దరు కౌన్సిలర్లు



**బాన్సువాడ :** బాన్సువాడ మున్సిపల్ కౌన్సిలర్లు నార్ల నందకిషోర్, మోతీలాల్ గురువారం హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మూడు రోజుల క్రితం బీఆర్ఎస్‌కు చెందిన నాలుగురు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరగా తాజాగా మరో ఇద్దరు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గతంలో 19 కౌన్సిలర్లు ఉండగా వారిలో ప్రస్తుతం 8 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు.

## ప్రధాన కాలువ వంతెన పరిశీలన



ప్రధాన కాలువ వంతెన సైడ్ వాల్‌ను పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ ఏఈ నందు

**నిజాంసాగర్(జుక్కల్):** మండలంలోని సుల్తాన్ నగర్ గ్రామ శివారులోని నిజాంసాగర్ ప్రధాన కాలువ వంతెనను గురువారం ఆర్‌అండ్‌బీ ఏఈ నందు పరిశీలించారు. ప్రధాన కాలువ వంతెన సైడ్‌వాల్ కూలిపోయి ప్రమాదకరంగా మారింది. కాలువలో నీటి ప్రవాహం ఉండటంతో ప్రయాణికులు, వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ప్రత్యేక చొరవతో వంతెనకు యుద్ధప్రాతిపాదికన మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దాంతో వంతెన సైడ్‌వాల్‌ను ఏఈ పరిశీలించి రెండు, మూడు రోజుల్లో నిర్మాణ పనులు చేపడుతామన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రమేష్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

## యాసంగి పంటల పరిశీలన



**మద్నూర్(జుక్కల్) :** డోంగ్లీ మండలంలోని లింబుర్ శివారులో యాసంగిలో సాగు చేస్తున్న కంది పంటను గురువారం ఏవో రాజు పరిశీలించారు. యాసంగిలో కంది వేయడం ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో లాభం పొందవచ్చన్నారు. మార్చి నెలలో పంట కోతకి వస్తుందని ఎకరాకు 5 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో నాందేవ్, రైతులు పురుషోత్తంపటేల్, హన్మాండ్లు తదితరులున్నారు.

## జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న రైతులు

**మద్నూర్(జుక్కల్) :** డోంగ్లీలో జొన్న పంట ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని గురువారం రైతులు తహసీల్దార్ రేణుక చౌహాన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి మద్నూర్,డోంగ్లీ మండలాల్లో 1740 ఎకరాల్లో రైతులు జొన్న పంట సాగు చేస్తున్నారన్నారు. జొన్న పంటకు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.3180 ప్రకటించిందన్నారు. మల్దాండి రకం జొన్నకు రూ.3225 ధర కల్పించిందన్నారు. మరో రెండు వారాల్లో జొన్న పంట కోతలు పూర్తవుతాయని అధికారులు, ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ జొన్న పంట కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మోహన్, శంకర్ అప్పా, మాధవ్‌రావు పాల్గొన్నారు.

## జీవో 317 సమస్యను పరిష్కరించాలి

**కామారెడ్డి టౌన్ :** ఉపాధ్యాయుల జీవో.317 సమస్యను ప్రభుత్వ మంత్రివర్గ ఉప సంఘం పరిష్కారం చూపాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, తెలంగాన అవినీతి వ్యతిరేక వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ విజయరామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ క్రమంలో ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం ఈ సమస్యకు శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు.

## కొనసాగుతున్న క్రికెట్ టోర్నీ

**తెయూ(డిచ్‌పల్లి):** తెయూ ఇంటర్ కాలేజీ క్రికెట్ మెన్ టోర్నమెంట్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. నాలుగవ రోజైన గురువారం మొదటి మ్యాచ్‌లో తెయూ మెయిన్ క్యాంపస్ పీజీ టీమ్‌తో తెయూ సౌత్ క్యాంపస్ టీం తలపడగా 12 ఓవర్లలో 104 పరుగులు సాధించి వర్సిటీ పీజీ టీం విజయం సాధించింది. సెమీస్‌లో గిరిరాజ్, కేర్ కళాశాలలు తలపడగా గిరిరాజ్ విజయం సాధించింది.

## ఫిబ్రవరి 29 మరపురాని రోజు..



ఫిబ్రవరి 29న వివాహం చేసుకున్న నూతన వధూవరులు సునీత, బాలు

**ఎల్లారెడ్డి :** ఫిబ్రవరి 29 జీవితంలో మరపురాని రోజు అని నూతన దంపతులు సునీత, బాలు అన్నారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణంలోని వీకేవీ ఫంక్షన్ హాల్‌లో ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్ తాండాకు చెందిన సునీతతో నల్గొండ జిల్లా అడవిదేవుల పల్లి మండలంలోని బాల్నేపల్లి గ్రామానికి చెందిన బాలుతో వివాహం జరిగింది.

## డ్వాక్రా రుణం చెల్లించలేక వివాహిత ఆత్మహత్య



చింతకుంట కవిత(ఫైల్)

**రామారెడ్డి:** డ్వాక్రా గ్రూప్‌లో రూ. 2.5 లక్షల రుణం పొంది వాయిదాలను చెల్లించలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కామారెడ్డి జిల్లా రామారెడ్డిలో గురువారం చోటుచేసుకుంది. రామారెడ్డి ఎస్సై విజయ్ కొండ తెలిపిన వివరాల ప్రకారం.. రామారెడ్డికి చెందిన కవిత(36)కు 20 ఏళ్ల క్రితం చింతకుంట కిషన్‌తో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. కవిత కొన్ని రోజుల క్రితం డాక్రా గ్రూప్ ద్వారా తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుంచి రూ. 2.50 లక్షలను లోన్ తీసుకుంది. లోన్ తాలుకా వాయిదాలను చెల్లించలేకపోవడంతో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## తండ్రికీ పరీక్షే..



తండ్రి ఒడిలో చిన్నారి

**బాన్సువాడ రూరల్ :** మండలంలోని కొయ్యగుట్ట ఫోర్త్ ఎంప్లాయీస్ కాలనీలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. కాగా గురువారం జరిగిన ఇంటర్ సెకండియర్ పరీక్ష రాసేందుకు ఇబ్రహింపేట్ గ్రామానికి చెందిన లక్ష్మి తన చంటిబిడ్డతో పాటు వచ్చింది. భర్త చంటిబిడ్డను ఎత్తుకోగా ఆమె పరీక్షకు వెళ్లింది. పరీక్ష పూర్తయ్యేంతవరకు భర్త ఆ పాపను ఆడిస్తూ గడిపారు.

## కట్టుకున్నవాడే కడ తేర్చాడు..

- ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నం
- కేసును ఛేదించిన పోలీసులు



మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

**బాల్కొండ:** మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వివాహిత కేసును పోలీసులు ఛేదించారు. కట్టుకున్న వాడే తనపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలంటూ భార్యను చిత్రహింసలకు గురిచేసి చివరికి టవల్‌తో మెడను గట్టిగా నొక్కి హత్య చేసినట్లు ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బాల్కొండ పీఎస్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై గోపి కేసు వివరాలు వెల్లడించారు. మండల కేంద్రానికి చెందిన ధర్మాయి లావణ్య(32), ధర్మాయి రాజేందర్ భార్యాభర్తలు. కొంత కాలంగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కోర్టులో పలు కేసులు కూడా నమోదయ్యాయి. కేసుల విషయమై విత్‌డ్రా చేసుకోవాలని లేదంటే చంపేస్తానంటూ మానసికంగా, శారీరకంగా లావణ్యతో పాటు ఆమె తల్లితండ్రులను రాజేందర్ భయభ్రాంతులకు గురిచేసేవాడు. దీంతో ఆమె గతంలోనే చనిపోవాలని సూసైడ్ నోట్ కూడా రాసి పెట్టుకుంది. కానీ ప్రయత్నాన్ని విరమించుకుంది. కోర్టులో గురువారం కేసు విచారణకు ఉండటంతో మంగళవారం రాత్రి కేసుల విషయమై వీరి మధ్య గొడవ జరిగింది. దీంతో లావణ్యను రాజేందర్ కొట్టి, టవల్‌తో గొంతును గట్టిగా నొక్కి హత్య చేశాడు. చివరకు హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించాడు. మృతిపై అనుమానం వచ్చిన పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టడంతో రాజేందర్ తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో భర్త రాజేందర్, ఆమెను హింసించిన అత్త ధర్మాయి గంగు, మామ పెద్దన్న, ఆడపడుచు మంగ గంగామణిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

## క్రైం కార్నర్

### వాగులో పడి ఒకరి మృతి

**మాక్లూర్:** ప్రమాదవశాత్తు వాగులో పడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని జన్నేపల్లి శివారులో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై సుధీర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వల్లభాపూర్‌కు చెందిన గొల్ల గంగాధర్ (55) బుధవారం జన్నేపల్లి సంతకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో సంత సమీపంలో ఉన్న వాగులో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వాగులోకి దిగడంతో ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. వాగులో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టినట్లు తెలిపారు. విచారణలో గంగాధర్ మృతదేహంగా గుర్తించినట్లు పేర్కొన్నారు. కాగా గంగాధర్ భార్య ఇందిర అనారోగ్యంతో 15 ఏళ్ల క్రితం మృతి చెందింది. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఒక కుమార్తె, కుమారుడి వివాహాలు జరిపించగా మరో కుమార్తె అయిన మానసిక వికలాంగురాలు ప్రియాంక తండ్రితో ఉంటోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

**అడ్లూర్‌ఎల్లారెడ్డిలో..**



స్వామి(ఫైల్)

**సదాశివనగర్:** మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి శివారులో ఒకరు చెట్టును ఢీకొని కాలువలో పడి మృతిచెందినట్లు ఎస్సై రాజు గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇందల్‌వాయి మండలం నల్లవెల్లికి చెందిన తిరుడు స్వామి(52) ఈ నెల 26న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కాలువలో మృతదేహం ఉందన్న ఇరిగేషన్ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టగా నల్లవెల్లికి చెందిన స్వామిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. కాగా కుటుంబీకులు మృతిపై అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించగా, కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య కళావతి, నలుగురు కుమారులు ఉన్నారు.

### బస్సు డ్రైవర్‌కు జైలు శిక్ష

**ఆర్మూర్‌టౌన్:** బస్సును అతివేగంగా నడిపి ఇద్దరి మృతికి కారణమైన బస్సు డ్రైవర్ మొహినొద్దీన్‌కు ఆర్మూర్ ప్రథమశేణి న్యాయమూర్తి వేముల దీప్తి గురువారం రెండు సంవత్సరాల సాధారణ జైలు శిక్ష, రూ. 1000 జరిమాన విధించినట్లు ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మెండోరా మండలం దూదిగాం జాతీయ రహదారిపై 2017 ఫిబ్రవరి 26న బైక్‌పై వెళ్తున్న కొడిచెర్ల గ్రామానికి చెందిన సామగంగారెడ్డి అతని కుమార్తె సృజన, మనమడు సమీత్‌రెడ్డిలను బస్సు డ్రైవర్ అతివేగంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో సమీత్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా సృజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. విచారణలో నేరం రుజువు కావడంతో డ్రైవర్‌పై రెండేళ్ల జైలు శిక్షను జడ్జి విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

### ఇద్దరి బైండోవర్

**కామారెడ్డి క్రైం:** రాత్రిపూట అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని గురువారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కాలనీల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న పట్టణానికి చెందిన తెడ్ల నగేశ్, మిట్టపల్లి బాబులను పట్టుకొన్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి ఉండాలని అన్నారు.

### జొన్న కుప్ప దగ్ధం

**బాల్కొండ:** ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన శివాయి చిన్న నర్సయ్యకు చెందిన తెల్ల జొన్న కుప్ప దగ్ధమైంది. బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో కుప్ప అగ్గిపాలైందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారుగా రూ. 30 వేలు విలువ చేసే జొన్నలు,రెండు తాటిపత్రలు కాలి బూడిదయ్యాయన్నారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

**కరెంట్ తీగలు తగిలి..**

**తాద్వాయి:** మండల శివారులో కరెంట్ తీగలు తగిలి మొక్కజొన్న పంట దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. మండల కేంద్రానికి బండారి రాములుకు చెందిన మొక్కజొన్న పంటపై బుధవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు కరెంట్ తీగలు ఒకదానికొకటి తగలడంతో నిప్పుకణికలు పంటపై పడి అగ్నికి ఆహుతైనట్లు తెలిపారు. చేతికొచ్చిన పంట నష్టపోయానని ట్రాన్స్‌కో అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరుతున్నాడు.

### వైన్‌షాప్ ఎదుట ఒకరి మృతి

**భీమ్‌గల్:** మండలంలోని వైన్‌షాప్ ఎదుట ఒకరు అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లు ఎస్సై హరిబాబు గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం వైన్‌షాప్ ఎదుట మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టినట్లు తెలిపారు. మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా కొండాపురం మండలానికి చెందిన మాల కొండయ్యగా గుర్తించినట్లు పేర్కొన్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### కాలువలో మృతదేహం లభ్యం

**రుద్రూర్:** కోటగిరి శివారులోని నిజాంసాగర్ కాలువలో మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. మృతుడిని రుద్రూర్ మండలం చిక్కడపల్లి గ్రామానికి చెందిన హంగర్గా వీరన్న(65)గా గుర్తించినట్లు పేర్కొన్నారు. కాలువలో దిగినపుడు నీటి ఉధృతికి కొట్టుకుపోయి మృతి చెంది ఉంటాడని తెలిపారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### డివైడర్‌ను ఢీకొన్న లారీ

**కామారెడ్డి క్రైం:** అదుపుతప్పిన ఓ బియ్యం లారీ డివైడర్‌ను ఢీకొన్న ఘటన గురువారం ఉదయం కామారెడ్డి బస్టాండ్ ఎదుట చోటు చేసుకుంది. డివైడర్‌ను ఢీకొన్న వెంటనే డ్రైవర్ బయటకు దూకేశాడు. దీంతో అతనికి స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఆ సమయంలో రద్దీ తక్కువగా ఉండటంతో పెను ప్రమాదం తప్పింది.

## వాటర్ ట్యాంకర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- డ్రైవర్‌కు తీవ్రగాయాలు, స్వల్పగాయాలపాలైన ప్రయాణికులు



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు

**భిక్కనూరు:** వాటర్ ట్యాంకర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలు కాగా, పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలైనట్లు సీఐ సంపత్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జంగంపల్లి శివారులోని జాతీయ రహదారిపై చెట్లకు నీరు పడుతున్న వాటర్ ట్యాంకర్‌ను హైదరాబాద్ నుంచి నిర్మల్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుకాల నుంచి వేగంగా ఢీకొన్నది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ గోపాల్‌కు తీవ్రగాయాలు కాగా పది మంది ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. ఘటన స్థలానికి క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించినట్లు సీఐ సంపత్‌ఖుమార్, ఎస్సై సాయికుమార్ తెలిపారు.



గాయపడ్డ డ్రైవర్

## భర్త వేధింపులతోనే భార్య ఆత్మహత్య



శిరీష (ఫైల్)

**నిజాంసాగర్(జుక్కల్):** భర్త వేధింపులతోనే వివాహిత నిజాంసాగర్ ప్రధాన కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మండలం గండిమాసానిపేటకు చెందిన శిరీష(25), సతీశ్ దంపతులు. వీరికి ఏడాది బాబు యోగేశ్ ఉన్నాడు. తరచూ భర్త వేధింపులతో పాటు ఆధార్‌కార్డులో అడ్రస్ మార్పు విషయమై వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మానసిక వేదనకు గురైన శిరీష బుధవారం తల్లిగారింటికి వెళ్తున్నాని చెప్పి కుమారుడు యోగేశ్‌తో కలిసి బస్సులో వెళ్లింది. మార్గమధ్యలో బస్సు దిగిన శిరీష నిజాంసాగర్ ప్రధాన కాలువ సమీపంలో ఉన్న చెట్టు కింద కుమారుడు యోగేశ్‌ను కూర్చోబెట్టి తాను కాలువలో పడి ఆత్మహత్య చేసుకుంది. నీటి ప్రవాహం ఎక్కువ ఉండడంతో మృతదేహం ఆచూకీ లభించలేదు. ప్రాజెక్టు నుంచి నీటి విడుదల నిలిపివేయడంతో గురువారం ఉదయం మృతదేహం లభ్యమైంది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## మొరం వ్యాపారులకు జరిమానా

**బాన్సువాడ రూరల్:** మండలంలోని తాడ్కోల్ శివారులో అక్రమంగా మొరం తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఒక జేసీబీని రెవెన్యూ అధికారులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. గురువారం ఉదయం వాహన యజమానులను పిలిపించి జరిమానా విధించారు. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధగా మొరం తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.